వెన్నశాతం వృద్ధి.. రైతు సమృద్ధి



అన్నదాతకు వ్యవసాయం..పాడి రెండు కళ్లు లాంటివి. ప్రతి రైతు సేద్యానికి అనుబంధంగా పాడి పరిశ్రమపై ఆధార పడుతున్నాడు. ఈ నేపథ్యంలో అధిక పాల దిగుబడి సాధించినప్పటికీ ఆ క్షీరంలో వెన్నశాతం లేకుంటే ధర ఉండదు. ఈ క్రమంలో పాడి రైతులు వెన్నశాతం పెంచుకోవడంలో కొన్ని సూచనలు పాటిస్తే కర్షకులు సంవృద్ధి సాధ్యమని నిపుణులు చెబుతున్నారు.



ముర్రా జాతి గేదెలు

పుత్తూరు రూరల్: పాడి రైతులు లాభాల బాట పట్టాలంటే పాలలో వెన్న శాతం పెరుగుదలపై దృష్టి సారించాలని పశుసంవర్థక శాఖ అధికారులు సూచిస్తున్నారు. పాలలో వెన్న శాతాన్ని ఆధారంగానే ధర నిర్ణయిస్తారని చెబుతున్నారు. పశువుల జాతి, ఈతల సంఖ్య, మేత, వాతావరణ పరిస్థితి తదితర అంశాలపై పాల దిగుబడి, వెన్న శాతం ఆధారపడి ఉంటుందని వివరిస్తున్నారు. ఈ అంశాలన్నింటిపై స్థానిక పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్.గురునాథ్ వివరించారు.

వెన్న శాతం తగ్గడానికి కారణాలివీ

- దేశవాళి ఆవుల కంటే సంకర జాతి ఆవుల పాలలో వెన్నశాతం తక్కువగా ఉంటుంది.
- పశువులను మేత కోసం అధిక దూరం నడిపించినప్పుడు, వ్యాధుల బారిన పడినప్పుడు వెన్నశాతం తగ్గుతుంది.
- పచ్చిగడ్డి ఎక్కువగా మేపి, ఎండు గడ్డి మేపకపోవడం, అగస్మాత్తుగా గ్రాసాన్ని మార్చినప్పుడు వెన్నశాతం తగ్గుతుంది.
- దాణాలో మొలాసిస్ 10 శాతం కంటే ఎక్కువ ఉన్నట్లయితే వెన్నశాతం తగ్గుతుంది.
- అధిక పాల దిగుబడి ఉన్నప్పుడు తక్కువ వెన్న శాతం ఉంటుంది.
- సాధారణంగా చలికాలంతో పోలిస్తే వేసవిలో వెన్నశాతం తగ్గుతుంది.

పెరగడానికి సూచనలివీ..

- అధిక దిగుబడినిచ్చే పశువులకు అందించే దాణాలో బైపాస్ ప్యాట్ సప్లిమెంట్లను 50 నుంచి 100 గ్రాముల వరకు కలిపి ఇవ్వడం ద్వారా వెన్న శాతాన్ని పెంచుకోవచ్చు.
- పశువులకు అందించే మేతలో మూండొంతులు ఎండు గడ్డి ఉండేలా చూసుకోవాలి.
- దాణాను నానబెట్టి ఇవ్వాలి, ఇందులో 100 గ్రాముల వరకు వంట సోడా కలిపి ఇవ్వడం ద్వారా పాల దిగుబడితో పాటు వెన్నశాతం పెంచుకోవచ్చు.
- పశుగ్రాసాన్ని కట్టర్‌తో కట్ చేసి చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించి అందించాలి. తద్వారా పీచు పదార్థం ఎక్కువగా జీర్ణం అయ్యి పాలలో వెన్నశాతం పెరుగుతుంది. ఈ ముక్కలు 7 నుంచి 9 మిల్లీమీటర్ల కంటే తక్కువగా ఉండకూడదు.
- పాల చివరి ధారల్లో వెన్న శాతం ఎక్కువగా ఉంటుంది. కావున చివరి పాల వరకు పూర్తిగా పిండుకోవాలి.
- పాలు పిండే సమయంపైనా వెన్నశాతం ఆధారపడి ఉంటుంది. వీలైనంత త్వరగా 7 నుంచి 8 నిమిషాల్లో పూర్తిగా పిండుకోవాలి. నెమ్మదిగా పిండితే వెన్నశాతం తగ్గిపోతుంది.

సస్యరక్షణ చర్యలతో అధిక లాభాలు



డాక్టర్ల సూచనల మేరకు పశువుల సంరక్షణ చర్యలు చేపడితే పాలలో వెన్నశాతం పెంచుకోవడం ద్వారా అధిక లాభాలు ఆర్జించవచ్చు. ఆవు పాల కంటే గేదె పాలలో వెన్న శాతం ఎక్కువగా ఉంటుంది. వేసవిలో అధిక ఉష్ణోగ్రత కారణంగా పాలలో వెన్న శాతం తగ్గుతుంది. ప్రతి 5 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత పెరిగితే పాలలో వెన్నశాతం 0.1 నుంచి 0.2 శాతం వరకు తుగ్గుతుంది. వేసవిలో పశువులను నీటి గుంటల్లో వీలైనంత వరకు ఈదనివ్వాలి. వేసవిలో చల్లటి నీటిని అందివ్వాలి. నట్టల నివారణ మందును వాడాలి.

–డాక్టర్ ఎస్.గురునాథ్, సహాయ సంచాలకులు, పశుసంవర్థక శాఖ, పుత్తూరు

క్లుప్తంగా

అదుపు తప్పిన ట్రాక్టర్



నగరి: మండలంలోని రామాపురం వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి పొలాల్లో వెళ్లింది. ఆదివారం ఉదయం పుత్తూరు వైపు వెళుతున్న ట్రాక్టర్ రామాపురం వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న ద్విచక్రవాహనాలను ఢీ కొని పంట పొలాల్లోకి దిగింది. అదృష్టవశాత్తు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం జరగలేదు. డ్రైవర్‌కు స్వల్పగాయాలు కాగా స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సోషల్ మీడియా కన్వీనర్‌గా తేజ

గంగాధరనెల్లూరు: వైఎస్సార్‌సీపీ జీడీ నెల్లూరు నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్‌గా జీడీ నెల్లూరుకు చెందిన తేజ నియమితులయ్యారు. తనపై నమ్మకం ఉంచి కన్వీనర్‌గా నియమించినందుకు పార్టీ పటిష్టత కోసం శాయశక్తులా కష్టపడతామని తేజ చెప్పారు.

వ్యర్థ జలాలతో దుర్వాసన



ఫ్యాక్టరీ నుంచి బయట వస్తున్న వ్యర్థ జలం

విజయపురం: మండలంలోని కోసలనగరంలో ఉన్న కోరా ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థ జలాలతో దుర్వాసన వస్తుందని జంబాడ గ్రామానికి చెందిన ప్రజలు ఆరోపిస్తున్నారు. ఫ్యాక్టరీలో వినియోగించే నీటిని శుద్ధి చేసి బయటకు వదలిపెట్టాల్సి ఉంది. అయితే ఫ్యాక్టరీ యజమానం నిబంధనలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. పలుమార్లు చెప్పినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం కనిపించలేదన్నారు. నీటి నుంచి వచ్చే దుర్వాసనతో భరించలేకపోతున్నామని, రోగాలు వస్తాయన్న భయంతో బిక్కు బిక్కుమని జీవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పెయిడ్ ఆర్టిస్టులను చూసి భ్రమపడకు

శ్రీరంగరాజపురం: యువగళం పాదయాత్రకు తమిళనాడు, కర్ణాటక నుంచి తెప్పించిన పెయిడ్ ఆర్టిస్టులను చూసి లోకేష్ భ్రమించిపోతున్నాడని డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జీడీ నెల్లూరు నియోజకవర్గంలో యువగళం పాద యాత్రకు తరలివచ్చిన ప్రజలు ఏపీ ఓటర్లు కాదని చెప్పారు. రాష్ట్రంలోనే గంగాధర నెల్లూరు నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గురవారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అనంత రెడ్డి, జనార్దన్, మణి ఉన్నారు.

వీధి దీపాల మరమ్మతు



వీధిదీపాలను మరమ్మతు చేస్తున్న సిబ్బంది

నింద్ర: స్థానిక పంచాయతీ కేంద్రంలోని వీధి దీపాలు వెలగకపోవడంతో సర్పంచ్ బాబురెడ్డి స్పందించి, వీధి దీపాలను ఆదివారం మరమ్మతు చేయించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే తమ కర్తవ్యమన్నారు.

చదువుతోనే ఉన్నత స్థితి

బుచ్చినాయుడుకండ్రిగ: సమాజంలో పేదరికాన్ని దూరం చేసి, ఉన్నత స్థితిని సాధించాలంటే చదువు ఒకటే మార్గమని జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో వెంకటగిరి, నాగలాపురం, పిచ్చాటూరు, సత్యవేడు, వరదయ్యపాళెం, తొట్టంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ మండలాల్లోని బీసీ హాస్టళ్లలో పదో తరగతి చదువుతున్న 143 మంది విద్యార్థులకు ప్రేరణ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఏబీసీడబ్ల్యూఓ చంద్రశేఖర్, వార్డన్లు రామయ్య, విజయలక్ష్మి, శ్రీలక్ష్మి, అనురాధ, అన్నపూర్ణ, గంగాధర్ పాల్గొన్నారు.

కిట్లు అందజేత

పిచ్చాటూరు: నాగలాపురం సచివాలయం వద్ద మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ అపరంజిరాజు, సచివాలయ కన్వీనర్ మోహన్ మొదలియార్ సమక్షంలో ఆదివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం స్టిక్కర్ కిట్లను సచివాలయ కన్వీనర్లకు అందజేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ పార్టీ కేంద్ర కార్యాలయం అందించిన మా నమ్మకం నువ్వే జగన్ కిట్లను మండలంలోని సచివాలయ కన్వీనర్లకు అందజేసే ప్రక్రియ పూర్తి చేశామన్నారు. విజయ్‌కుమార్, దేశన్, ముత్తు పాల్గొన్నారు.

అన్ని వేళలా అండగా ఉంటాం



చిరంజీవియాదవ్‌ను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత కుమారస్వామిరెడ్డి

పుత్తూరు రూరల్: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు అన్ని వేళలా అండగా ఉంటామని మంత్రి ఆర్కే రోజా సోదరుడు వై.కుమారస్వామి రెడ్డి భరోసా ఇచ్చారు. ఆదివారం చిన్నబ్బనాయుడు కండ్రిగకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు చిరంజీవియాదవ్ తండ్రి సుబ్రమణ్యంయాదవ్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుమారస్వామి రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి పెద్దను కోల్పోయినా మనోధైర్యంతో ముందుకెళ్లాలని సూచించారు. పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, నేతలు బాలాజీ, కడియాల నాయుడు, జనార్దన్, వెంకటముని మేస్త్రీ, భాస్కర్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

నింద్ర: మండలంలోని శ్రీరామాపురం గ్రామంలోని బిసి కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త నాగరాజు(46) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. సమాచారం అందుకున్న మంత్రి రోజా సోదరుడు కుమారస్వామిరెడ్డి ఆ గ్రామానికి వెళ్లిచ మృతదేహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. అతడి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ దీప, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌లాల్, కోఆప్షన్ సభ్యుడు అనిల్, ఎంపీటీసీ సభ్యుడు విజేష్, నాయకులు వేణురాజు, మహేష్, తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ నేత కుటుంబానికి మంత్రి సోదరుడి పరామర్శ



వెంకటేష్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

వడమాలపేట: మండలంలోని వడమాల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వెంకటేష్ తండ్రి కర్రయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మంత్రి ఆర్కే రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం ఆ గ్రామానికి విచ్చేసి వెంకటేష్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు వైఎస్సార్ సీపీ అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సదాశివయ్య, సుధ, చిన్నబ్బ, రమేష్‌రాజు, ఆనందయ్య, సురేష్‌రాజు, రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే మండలాభివృద్ధి

శ్రీరంగరాజపురం: ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేస్తేనే మండలాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ సరిత తెలిపారు. మండల అభివృద్ధి కార్యాలయంలో ఆదివారం ఎంపీడీవో క్రిష్ణయ్య ఆధ్వర్యంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో ఎంపీపీ మాట్లాడుతూ సమావేశం దృష్టికి వచ్చిన సమస్యలపై ప్రజా ప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని స్పష్టం చేశారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఎద్దడి లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని చెప్పారు. విద్యుత్ అంతరాయం లేకుండా రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించి రైతులను ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం పేదలకు ప్రతిష్టాత్మకంగా అందించిన పక్కాగృహాల నిర్మాణాలను వేగవంతం చేసి మార్చి ఆఖరిలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భవన నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, పలువురు పాల్గొన్నారు.

ఘనంగా మహాకుంభాభిషేకం



కలశాన్ని ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

గంగాధరనెల్లూరు: మండలంలోని కొత్రకోన గ్రామంలో వెలసిన శ్రీమల్లేశ్వరస్వామి ఆలయ మహాకుంభాభిషేకాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అర్చకులు వేకువజామున యాగశాలపూజ, హోమం, పూర్ణాహుతి, సంకల్పం, విమాన కుంభాభిషేకం వంటి కైంకర్యాలు చేపట్టారు. మేళతాళాలు, అర్చకుల మంత్రోచ్చారణ మధ్య మూలస్థాన విగ్రహానికి కుంభాభిషేకం, ప్రాణప్రతిష్ట చేశారు. అనంతరం దీపారాధన చేసి విశేష పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, ఉత్సవంలో పాల్గొన్నారు.

దివ్యాంగుడి ఇంటి నిర్మాణానికి చేయూత



భూమి పూజ చేస్తున్న గుణశేఖర్, మహిళలు

వెదురుకుప్పం: నిలువ నీడ లేక అవస్థలు పడుతున్న దివ్యాంగుడి ఇంటి నిర్మాణం కోసం సోక్రటీస్ పాఠశాల యాజమాన్యం చేయూతనిచ్చింది. మండలంలోని నెమలగుంట గ్రామానికి చెందిన దివ్యాంగుడు నాగరాజుకు ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇల్లు నిర్మించుకోవడానికి సోక్రటీస్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ కరెస్పాండెంట్ గుణశేఖర్ ఆర్థిక సాయం అందించారు. ఈ నిధులతో ఆదివారం ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. దాత గుణశేఖర్ మాట్లాడుతూ నాగరాజు ఇంటి నిర్మాణానికి తనవంతుగా రూ.2 లక్షల సాయం అందించి, పనులు పూర్తి చేసే వరకు తోడుగా ఉంటానని హామీ ఇచ్చారు.

జోరుగా వరి కోతలు



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు, పల్లమాల, నెలవాయి, కళ్లివెట్టు, తలారివెట్టు, వేణుగోపాలపురం గ్రామాల్లోని రైతులు జోరుగా వరి కోతలు కోస్తున్నారు. ఈ గ్రామాల్లో రబీలో రైతులు 1,850 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. పంటను ముందుగా సాగు చేయడంతో కోతలు తొందరగా కోస్తున్నారు. ఈ ఏడాది ఎకరాలకు 40 బస్తాలు దిగుబడి వస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వరి ధాన్యానికి మార్కెట్‌లో ధర బాగా ఉండడంతో ఎకర పంటలకు అన్ని ఖర్చులు పోను రూ.25 వేలు మిగులుతుందని రైతులు అంటున్నారు.

విశ్రాంత ఉద్యోగుల సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న సీఐ లక్ష్మీనారాయణ

పుత్తూరు రూరల్: విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యులు చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని సీఐ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక పెన్షనర్ల భవనంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందామని నిరుత్సాహ పడకుండా, వృద్ధాప్యం పైన పడిందని బాధ పడకుండా తరచూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం పుత్తూరు విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యుల గొప్పతనమని కొనియాడారు. వారి ఉత్సాహం పలువురికి ఆదర్శం కావాలని ఆకాంక్షించారు. నేటి సమాజంలో ఇలాంటి సంఘాలు, కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. వెయ్యికి పైగా సభ్యులు కలిగిన సంఘాన్ని ఒక్క తాటిపై నడుపుతూ పలు సేవా కార్యక్రమాల నిర్వహణకు బాధ్యత వహిస్తున్న సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రాజును ప్రత్యేకంగా అభినందించారు. తిరుపతి నుంచి విచ్చేసిన ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ యుగంధర్, చంద్ర శిబిరంలో పలువురికి పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన వైద్య శిబిరంలో 300 పైగా వైద్య సేవలందుకున్నారు. ఈ కార్యక్రమంలో డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చెంగల్ రాజు, పెన్షనర్ల సంఘం నాయకులు గుణశేఖర్‌రెడ్డి, యుగంధర్‌రాజు, రవిశంకర్, రామలింగం, నిర్మలా జయకుమారి, చంద్రశేఖర్‌వర్మ, గుణశేఖర్‌వర్మ, వెంకటకృష్ణమనాయుడు పాల్గొన్నారు.

శిశు రక్షణలో ఆశాలది కీలక పాత్ర

నగరి: నవజాత శిశువులు, గర్భిణుల రక్షణలో ఆశాలది కీలక పాత్ర అని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు చందామరై అన్నారు. ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా నాలుగో మహాసభలు నగరిలోని రాఘవేంద్ర కల్యాణ మండపంలో ఆదివారం జరిగాయి. ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన చందామరై మాట్లాడుతూ ఆశా కార్యకర్తల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ అర్హులైన ఆశాలను ఏఎన్ఎంగా గుర్తించాలని, ఈ బడ్జెట్ సమావేశంలో ఆశా కార్యకర్తలకు జీతాలు పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ అధ్యక్ష కార్యదర్శులు సుహాసిని, శాంతి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు వేలన్, నాచకులు బాషా, చంద్రబాబు, మోహన్, పరిమళ, నవోమి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా వేంకటేశులు

నింద్ర: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా మిట్టకండ్రిగ గ్రామానికి చెందిన వేంకటేశులు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు అందినట్లు పార్టీ మండల కన్వీనర్ వేణురాజు తెలిపారు. కో కన్వీనర్లుగా లోకేష్, సత్యరాజ్, శేఖర్, సునీల్ కూమార్ నియమితులయ్యారు.

భూమిపూజ

ఏర్పేడు: మండలంలోని నచ్చనేరిలో ఆదివారం అంకమ్మ ఆలయానికి భూమిపూజ చేశారు. ఇటీవల గ్రామస్తులు అంకమ్మ ఆలయాన్ని నిర్మించాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి విన్నవించారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని టీటీడీ నుంచి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేయించారు. దీంతో ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు.

బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13వ తేదీ నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో అధికా రులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తనిఖీ చేపట్టారు. ఆలయంలో నాలుగు గోపురాలు, కైలాసం సెట్టింగ్, ధూర్జటి కళా ప్రాంగణం, ఆలయ పరిసరాల్లో తనిఖీ చేశారు.

అంకాలమ్మకు అభిషేకాలు



విశేషాలంకరణలో అంకాల పరమేశ్వరి



మునేశ్వర స్వామికి పొంగళ్లు తీసుకెళ్లుతున్న మహిళలు

పాలసముద్రం: మండలంలోని పాలసముద్రం అంకాళేశ్వరమ్మ, రాచపాల్యం మునేశ్వరస్వామికి ఆదివారం గ్రామస్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారిని మేల్కొల్పి, ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. మధ్యాహ్నం నూతన వస్త్రాలు, పూజా సామగ్రిని మంగళ వాయిద్యాల మధ్య ఊరేగించి స్వామి, అమ్మవారికి అందించారు. మహిళలు అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పొంగళ్లు సమర్పించారు. సాయంత్రం అమ్మవారిని సుదరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

సమావేశాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి

పిచ్చాటూరు: మండలంలో సభలు, సమావేశాలు నిర్వహించడానికి పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఈ నెల ఒకటి నుంచి 28 వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ 1961 అమలులో ఉందన్నారు. ఈ నేపథ్యంలో ర్యాలీలు, ధర్నాలు, సభలు, బహిరంగ సమావేశాలు నిర్వహించడానికి పోలీసుల అనుమతి తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

ముమ్మూర్తుల శక్తి.. మూగజీవులకు ముక్తి

శివుడిని పూజిస్తున్న మూగజీవాలు



శ్రీకాళహస్తీశ్వరాలయం దేశంలోని ఇతర శైవాలయాలతో పోలిస్తే ఒకింత భిన్నం. మూగజీవులైన (శ్రీ–కాళ–హస్తిలకు) సాలీడు..సర్పరాజం.. ఏనుగు భక్తికి మెచ్చి.. ఆ మూడు జీవులకు శివసాయిజ్యం ప్రసాదించిన ముక్తి ప్రదాత. అందుకే ఇది సద్యోముక్తి క్షేత్రంగా(అడుగిడిన వెంటనే ముక్తిని ప్రసాదించే), భక్తుల పాలిట దక్షిణ కైలాసంగా ఖ్యాతి గాంచింది. అందుకే ఇక్కడ నిర్వహించే బ్రహ్మోత్సవాలంటే ముల్లోకాలకు పండుగే. నేటి నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ పుణ్యక్షేత్రంపై ప్రత్యేక కథనం. – శ్రీకాళహస్తి



విద్యుత్ వెలుగుల్లో శ్రీకాళహస్తి పట్టణం



ఆలయంలో విద్యుద్దీపాలంకరణ



దేవతామూర్తుల విద్యుత్ కటౌట్లు

మూగజీవులకు ముక్తి నిచ్చిన భూతల కైలాసంగా శ్రీకాళహస్తి క్షేత్రం ఖ్యాతి గాంచింది. ఈ వాయులింగేశ్వర క్షేత్రం మహాశివరాత్రికి సన్నద్ధమైంది. దేవస్థానం భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. మూగజీవాలకు ముక్తితో శ్రీకాళహస్తి అనే పేరు సార్థకమైంది. కృతయుగంలో సాలెపురుగు (శ్రీ), పాము (కాళ), ఏనుగు (హస్తి)ఒకదానికి తెలియకుండా ఒకటి శివుడ్ని నిత్యం పూజించేవి. శివలింగాన్ని ఎండ వానల నుంచి రక్షించేందుకు సాలె పురుగు గూడు అల్లి పూజించేది. పాము రత్నాలు, ముత్యాలతో.. ఏనుగు తొండంతో నీరు తెచ్చి అభిషేకం చేసి ఫల, పుష్ప, పత్రాలు పెట్టి పూజించేది. అయితే ఎవరో శివుడికి హాని చేసే కార్యక్రమం తలపెడుతున్నారని వేటికవి భయపడుతాయి. ఏనుగుని సంహరించాలని పాము తొండంలో దూరి బాధపెడుతుంది. ఆ బాధను భరించలేక తొండాన్ని బండకు ఢీ కొట్టి ఏనుగు మరణిస్తుంది. ఏనుగు తొండంలో ఉన్న పాము కూడా మృతి చెందుతుంది. శివలింగానికి పైన ఉన్న సాలెపురుగు కూడా మరణిస్తుంది. శివుడు ఈ మూడింటికి ముక్తిని ప్రసాదిస్తాడు. శివైక్యం పొందిన వాటి రూపంలోనే శివలింగం మొత్తం సర్ప శరీరంగా దర్శనమిస్తోంది. పైనుంచి కింది వరకు ఏనుగు దంతాలు, అడుగు భాగంలో సాలెపురుగు ఆకారాన్ని పోలి ఉంటుంది. ఏనుగు దంతాల మధ్యలో భక్తుడైన కన్నప్ప కన్ను కనిపిస్తుంది. అందుకే ఈ క్షేత్రం శ్రీ,కాళహస్తిగా పేరు గాంచింది.

పల్లవించెను నాడు.. పరిమళించెను నేడు

దేశంలో ఎక్కడా లేని విధంగా శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని నిర్మించారు. శైవ, స్కంధ, లింగ పురాణాల ప్రకారం బ్రహ్మ శివానుగ్రహంతో కైలాసం నుంచి శ్రీకాళహస్తీశ్వర విగ్రహాన్ని తెచ్చారని, అందువల్ల ఈ కొండకు కైలాసగిరి అని పేరు వచ్చిందంటారు. అర్జునుడు తన తీర్థయాత్రలో ఈ స్థలాన్ని దర్శించి కైలాస నాథీశ్వరున్ని పూజించారు. భరద్వాజ మహర్షి ఇక్కడే తపస్సు చేసి స్వర్ణముఖి నది పవిత్రతను వివరించారని పురాణ కథనం. కైలాసగిరికి దిగువన ఉన్న ఆలయాన్ని మొదట పల్లవరాజులు, తరువాత తొండమాన్ చక్రవర్తి నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. చోళులు ప్రధాన ఆలయాన్ని పునరుద్ధరించారు. 11వ శతాబ్దంలో కుళోత్తుంగ చోళుడు గాలిగోపురాన్ని కట్టించారు. నారాయణవనాన్ని పరిపాలించిన వీరనరసింహ యాదవరాయుడు 12వ శతాబ్దంలో బయటి ప్రాకారాన్ని, ఆలయం నాలుగు మార్గాలను కలుపుతూ నాలుగు గోపురాలను నిర్మించారు. ఆ కాలంలోనే స్వర్ణముఖినదిపైన ఆనకట్ట నిర్మించారు. 1516లో శ్రీకృష్ణదేవరాయలు నూరు స్తంభాల మండపాన్ని, మరో భారీ గాలిగోపురాన్ని కట్టించారు.1529లో అచ్యుతరాయలు శ్రీకాళహస్తిలో పట్టాభిషేకం చేయించుకున్నాడు. 1912లో నట్టుకోట చెట్టియార్లు రూ.9 లక్షలు వెచ్చించి ఆలయం తుది మెరుగులు దిద్దారు. శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకున్న వారికి సకలపాపాలు తొలగి, అష్టైశ్వరాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం.